హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన ర్యాకల శేఖర్‌గౌడ్, తదితరులు

మనోహరాబాద్, జనవరి 6: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును బీఆర్ఎస్ నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం కలిశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో హరీశ్‌రావు చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పంజా భిక్షపతి, నరేశ్ ముదిరాజ్, వెంకటేశ్, రాహుల్, శివ, జాంగీర్, సుధాకర్, వెంకటేశ్ యాదవ్, సలీం పాల్గొన్నారు.

అన్ని మందులు అందుబాటులో ఉంచాలి

నార్సింగి పీహెచ్‌సీలో అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుట, జనవరి 6: ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల జబ్బులకు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నార్సింగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 108 అంబులెన్స్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వైద్యసేవలపై ఆరా తీసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నార్సింగి చుట్టపక్కల వారితో పాటు రహదారి నుంచి వెళ్లే వారు కూడా అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు, మాజీ జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేశంగౌడ్, ఎంపీడీవో ఆనంద్, తహసీల్దార్ కరీం, డాక్టర్ రవికుమార్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

శివ్వంపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

బీఆర్ఎస్ కార్యకర్త పరామర్శించిన ఎమ్మెల్యే

శివ్వంపేట, జనవరి 6: మండలంలోని పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన నాగమణికి మంజూరైన రూ.19,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కును నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ సర్పంచ్ చంద్రకళ శ్రీశైలంయాదవ్, ముద్దగల్ల రాజు తదితరులు ఉన్నారు.

చిలిపిచెడ్, జనవరి 6: మండల రాందాస్‌గూడకు చెందిన బాబురావు తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సోమవారం బాబురావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి, నాయకులు వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

ప్యారారంలో ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న డాక్టర్ రంగనాయకులు

రేగోడ్, జనవరి 6: అధిక లాభాలు కావాలంటే ఆయిల్‌పామ్ పంటను పండించాలని రాష్ట్ర ఆయిల్ పామ్ టెక్నికల్ సలహాదారుడు రంగనాయకులు తెలిపారు. సోమవారం రేగోడ్ రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు ఉద్యానవన శాఖ ద్వారా మొక్కలపై రాయితీలో పాటు నాలుగేండ్ల పాటు తోట నిర్వహణ, అంతర పంటల సాగు రాయితీ కలిపి రూ 28,450 సొమ్మును రైతుల ఖాతాలో జమచేస్తారన్నారు. 2024-2025కు జిల్లాకు సుమారు రెండు వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రణాళిక చేసినట్లు వివరించారు. అనంతరం మండలంలోని ప్యారారం గ్రామంలో పండిస్తున్న నర్సింగ్‌రావు భూమి లో ఆయిల్‌పామ్ పంటను పరిశీలించారు. వారితో ఏవో జావీద్, ప్రాజెక్ట్ మేనేజర్ కృష్ణ, వ్యవసాయ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

మండలి చీఫ్ సెక్రటరీ వీరారెడ్డి

చిన్నశంకరంపేట, జనవరి 6: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగి మంచి పేరు తీసుకురావాలని శాసనమండలి ఛీఫ్ సెక్రటరీ బి.వీరారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని సూరారం జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్రిపరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దన్నారు. పరీక్షల ముందు విద్యార్థులు ప్రణాళికలను వేసుకుని ఏకాగ్రతతో చదువుకోవాలన్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే విజయం మనదే అవుతుందన్నారు.

మాట్లాడుతున్న తెలంగాణ శాసనమండలి చీఫ్ సెక్రటరీ వీరారెడ్డి

సాక్షర భారత్‌కు ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలి

నర్సాపూర్, జనవరి 6: ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం సాక్షర భారత్ కో ఆర్డినేటర్ల డిమాండ్లను నెరవేర్చాలని జిల్లా సాక్షర భారత్ అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పెద్దచింతకుంట జలహనుమాన్ వద్ద మండల, గ్రామ కో-ఆర్డినేటర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీని కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేసినట్లు గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించినా తమ సమస్యను దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కో-ఆర్డినేటర్లు భాస్కర్, రాజేందర్, కావేరి, మంజుల, మమత, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రికవరీ ఫోన్లు అందజేత

మెదక్‌రూరల్, జనవరి 6: సెల్‌ఫోన్లు పోయినా, చోరీకి గురైనా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తక్షణమే ఫిర్యాదు చేయాలని ఎస్సై మురళి అన్నారు. వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న మండలానికి చెందిన బాధితులకు సీఈఐఆర్ వైబ్‌సైట్ ద్వారా రికవరీ చేసినట్లు సోమవారం అందజేశారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 6: ఎన్నికల హామీల్లో భాగంగా కామారెడ్డి డిక్లరేషన్‌ను రేవంత్‌రెడ్డి వెంటనే అమలుచేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుభాష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్‌తో కలిసి ఆయన మాట్లాడారు.

రైతులను నట్టేటముంచిన కాంగ్రెస్

- మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి
- రైతు భరోసా కోసం రైతన్నల ఆందోళన

పాపన్నపేట, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఆరోపించారు. పాపన్నపేటలో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతుభరోసా కింద ఎకరానికి ఏటా రూ.15 వేలు రైతుల ఖాతాలో వేస్తామన్నారని, తీరా ఇప్పుడు రూ.12వేలు మాత్రమే చెల్లిస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు.

చేగుంటలో..

చేగుట, జనవరి 6: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, రైతులను పట్టించుకున్న పాపనపోలేదని రైతులు ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్లన్న సాగర్ కాల్వ ద్వారా యాసంగికి నీరు అందించాలని కోరారు.

చిన్నశంకరంపేటలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

రైతుల రాస్తారోకో

చిన్నశంకరంపేట, జనవరి 6: ఎన్నికల హామీ మేరకు రైతులకు రైతుభరోసా ఎకరాకు రూ.15వేలు అందించాలని డిమాండ్ చేస్తూ చిన్నశంకరంపేటలో బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి మెదక్-చేగుంట రహదారిపై బైఠాయించి, రాస్తారోకో చేశారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15వేల రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పద్మాదేవేందర్‌రెడ్డి పుట్టిన రోజు



రామాయంపేటలో గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



చేగుంట: కేకు కట్ చేస్తున్న నార్సింగి నాయకులు

రామాయంపేటలో గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 6: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పుట్టిన రోజును సోమవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జుగౌడ్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, ఆర్‌కె శ్రీనివాస్, జయరాజ్, కిశోర్ బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కో కన్వీనర్లు గడ్డమీది కృష్ణాగౌడ్, లింగారెడ్డి, నాయకులు ప్రభురెడ్డి, జుబేర్, శంకర్, బీఆర్ఎస్వీ నాయకులు కిరణ్, అరుణ్ కలిసి ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించి శుభకాంక్షలు తెలిపారు.

చేగుంటలో..

చేగుట, జనవరి 6: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నార్సింగిలో పార్టీ మండల అధ్యక్షుడు మైలరాం బాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నార్సింగి మాజీ వైస్ ఎంపీపీ సుజాత శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, ఆకుల మల్లేశంగౌడ్, యోగి, గొండస్వామి, జగన్‌రెడ్డి, కాస్లాపూర్ యాదగిరి, రాజశేఖర్, భాషనాయక్, భూపతి, రాజు, ఓం ప్రకాశ్, కమ్మరి రాజు, బోల్ల స్వామి, ఎంకె నారాయణ, వేణు ఉన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, జనవరి 6: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పుట్టిన రోజును చిన్నశంకరంపేటలో పార్టీ మండలాధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

రామాయంపేటలో..

మెదక్ రూరల్, జనవరి 6: మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పుట్టిన రోజును శామీర్‌పేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు మోహన్‌నాయక్ శుభాకాంక్షలు తెలిపారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, జనవరి 6: పద్మాదేవేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సీనియర్ నాయకులు బొద్దుల భిక్షపతి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులపై అలసత్వం వద్దు

ప్రజావాణిలో ఆర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్

జిల్లా కేంద్ర పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- కలెక్టర్ రాహుల్ రాజ్

- ప్రజావాణిలో 61 దరఖాస్తుల స్వీకరణ

మెదక్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులపై అలసత్వం తగదని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్‌వో భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ 61 ఫిర్యాదులు స్వీకరించారు. పింఛన్ల కోసం-03, భూ సమస్యలు- 20, ఇందిరమ్మ ఇండ్లు-11, ఇతర సమస్యలు-27 ఉన్నాయి. సమస్యల పరిష్కారానికి ప్రజావాణిలో వస్తున్న విజ్ఞప్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆదేశించారు. మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో యూనూస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కాపాడాలని కలెక్టర్‌కు వినతి

నర్సాపూర్, జనవరి 6: మండలంలోని జక్కపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 86/2లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు ఆరోపించారు. సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కి వినతి పత్రం అందజేసి వారు మాట్లాడారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు రాంచంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, చంద్రయ్య, సంగాగౌడ్, విఠల్ నాయక్ ఉన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, జనవరి 6: అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లేశ్

మల్లేశ్‌ను సన్మానిస్తున్న కృష్ణయ్య

మెదక్ మున్సిపాలిటీ/పాపన్నపేట, జనవరి 6: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పాపన్నపేట మండల ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్ ముదిరాజ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్యను మల్లేశ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. మల్లేశంను కృష్ణయ్య సత్కరించారు. ఆయనతో అనిల్‌కుమార్, సంతోష్, రాంచందర్, పెంటయ్య, చంద్రశేఖర్ ఉన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

రంగాగౌడ్ (ఫైల్)

రామాయంపేట, జనవరి 6: మండలంలోని డి.ధర్మారం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రంగాగౌడ్ (58) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మాజీ సర్పంచ్ రంగాగౌడ్ కొన్ని రోజులుగా కిడ్నీల బాధతో దవాఖానల చుట్టూరా తిరుగుతూ చికిత్సలను చేయించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. డి.ధర్మారం బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్‌లు సిద్దిరాంరెడ్డి, బాజ సిద్ధరాములు, ఉడుత సిద్దయ్య, మాజీ వైస్ ఎంపీపీ ముస్కుల స్రవంతి సంతాపం తెలిపారు.

కలం స్నేహం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మెదక్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): మన సంస్కృతి, సంప్రదాయాలను ఆచరింపజేయాలనే తలంపుతో కలం స్నేహం సంగీత సాహిత్య సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ సంగీత దర్శకుడు శ్రీమాన్ గోపాల్ ఆచార్య ముగ్గుల పోటీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పసుపు నూరి ఎల్లమ్మ దేవాలయంలో జిల్లాలో కలం స్నేహం సంస్థ ముగ్గుల పోటీలు, నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గీతా శ్రీస్వర్గం, జిల్లా అధ్యక్షురాలు భాగ్య అశోక్, కార్యవర్గం టీం మాధవీ లత, కవిత అశోక్, రాజమణి, అమూల్య, వసుధ, సంధ్యారాణి పాల్గొన్నారు. ముగ్గుల పోటీలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

పాఠశాలలకు పుస్తకాలు, పరికరాల పంపిణీ

వెల్దుర్తి, జనవరి 6: ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ పరికరాలు, పుస్తకాలను త్వరలోనే పంపిణీ చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మానేపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలన్నారు. మానేపల్లి వాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి భూమిపూజ చేశారు.

రామాయంపేట కేజీబీవీకి పతకాల పంట

పోటీలో పాల్గొన్న 58 మంది విద్యార్థులకు బహుమతులు

మెదక్‌లో జరిగిన కరాటే పోటీలో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థినులు

రామాయంపేట, జనవరి 6: పట్టణంలోని కేజీబీవీకి చెందిన విద్యార్థినులు మెదక్‌లో జరిగిన జాతీయ కరాటే పోటీలో పతకాల పంట పండించారు. మెదక్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఈ పోటీలో 58 మంది విద్యార్థినులు మాస్టర్ కుందెన నాగరాజు నేతృత్వంలో పాల్గొన్నారు. 58 మందిలో 34 మందికి బంగారు, 11 మందికి సిల్వర్, 13 మంది కాంస్య పతకాలు సాధించారు. పాఠశాల నుంచి పాల్గొన్న 58మందికి బహుమతులు రావడం హర్షించదగ్గ విషయమని పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ పేర్కొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు ప్రశాంతంగా డ్రైవింగ్ చేయాలి

బహుమతులను అందజేస్తున్న డీటీఓ

మెదక్ అర్బన్, జనవరి 6: ఆర్టీసీ డ్రైవర్లు ప్రశాంతంగా డ్రైవింగ్ చేయాలని డీటీవో వెంకటస్వామి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉద్యోగుల జాతీయ రోడ్డు భద్రత మాసోపాత్సాలు, ఉత్తమ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే జాగ్రత్తగా ఇంటికి చేరుకోవచ్చని ఆయన తెలిపారు. డిసెంబర్‌లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు క్యాష్ అవార్డులు అందజేశారు. రీజనల్ మేనేజర్ ప్రభులత, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రేగోడ్, జనవరి 6: రేగోడ్ గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ వీరప్ప కొన్ని రోజుల క్రితం మృతిచెందాడు. ఆయన పాపన్నపేటలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించేవారు. ఆయన కుటుంబానికి తమవంతు సాయంగా 1.45లక్షల ఆర్థిక సాయాన్ని ఆయన సతీమణికి సోమవారం అందజేశారు. 1992 కానిస్టేబుల్ బ్యాచ్‌మెంట్స్ రవీందర్‌రెడ్డి, రఘునాథ్ సింఘ్, రవి, సికిందర్ తదితరులు అందజేశారు.

కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

రామాయంపేట, జనవరి 6: వేంకటేశ్వర స్వామి వార్షిక ఉత్సవాలకు రావాలని కోరుతూ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు సోమవారం అందజేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

వెల్దుర్తి, జనవరి 6: ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్ విద్యాధికారి మాధవి అన్నారు. సోమవారం వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మాధవి పరీక్షల సన్నద్ధత, ప్రత్యేక తరగతులపై అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు ఉన్నారు.

స్పెషల్ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

మెదక్ అర్బన్, జనవరి 6: జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద ఆధ్వర్యంలో స్పెషల్ లోక్ అదాలత్‌ను సోమవారం నిర్వహించారు. రెండు మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులో ఇరు పక్షాల వారిని రాజీ కుదిర్చి ఒక ఎంవీవోపీ కేసులో రూ.11,60,000, మరో ఎంవీఓపీ కేసులో రూ.12,10,000 ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌ను బాధితులకు ఇప్పించారు. రిలయన్స్ ఇన్సూరెన్స్ సభ్యులు, న్యాయవాదులు దేవరాజ్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అంబులెన్స్ ప్రారంభం

నిజాంపేట, జనవరి 6: నిజాంపేటలో 108 అంబులెన్స్‌ను మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు సోమవారం ప్రారంభించారు. అనంతరం నస్కల్‌లో అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టు నర్సింహులు కుటుంబసభ్యులను పరామర్శించారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన డీఈవో

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 6: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చంద్రశేఖర్ సేవా సంస్థ దాతృత్వంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను డీఈవో రాధాకిషన్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, విద్యా శాఖ అకాడమిక్ కోఆర్డినేటర్ సుదర్శనమూర్తి, సేవా సంస్థ సభ్యురాలు భారతి, హెచ్ఎం రేఖ పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

పాపన్నపేట, జనవరి 6: సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాపన్నపేట ఏఎస్ఐ గాలయ్య అన్నారు. సోమవారం జాతీయ రోడ్ల భద్రతా వారోత్సవాల సందర్భంగా యూసూఫ్‌పేట ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, ఏటీఎం మోసాలు, మూఢనమ్మకాలు, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సోమక్కపేట సొసైటీలో మూడు తీర్మానాలు

చిలిపిచెడ్, జనవరి 6: మండలంలోని సోమక్కపేట సొసైటీలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సంఘం సభ్యులు సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి, మూడు తీర్మానాలు చేసినటుల సీఈవో పోచయ్య, చైర్మన్ ధర్మారెడ్డి తెలిపారు. సోమవారం సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో 19 పంచాయతీలకు కలిపి ఒక్కటే ఉండడంతో చిలిపిచెడ్, అజ్జమర్రి, సోమక్కపేటతో కలిపి మూడు సొసైటీలు ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, విఠల్, అంబర్‌సింగ్, గంగాంధర్, యాదగౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన విహారయాత్రకు ఆర్థికసాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటరాంరెడ్డి

శివ్వంపేట, జనవరి 6: మండలంలోని కొంతాన్‌పల్లిలో జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు వెళ్తున్న విజ్ఞాన విహార యాత్రకు శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. రవీందర్‌రెడ్డి, దుర్గారెడ్డి, లక్ష్మణ్‌చారీ, శ్రీనివాస్, బొల్లారం శ్రీకాంత్, భాను ప్రకాశ్, స్వామి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★Siddipet Town 150 yards Plot Sale: Near Govt. Degree College in Prashant Nagar Colony, Opposite Adarsha Vidhyaniketan School. 9396677876.

NT-338994

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.